విశాలాంధ్ర
గోదావరి జిల్లా
కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

2, 3 తేదీల్లో ప్రత్యేక ఓటు నమోదు

విశాలాంధ్ర - కాకినాడ : ఈ నెల 2, 3 తేదీల్లో ప్రత్యేక ఓటు నమోదు శిబిరాలను ఏర్పాటు చేయనున్నామని, జిల్లా 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా అన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా శుక్రవారం అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ డా.కృతికా శుక్లా..ఆయా నియోజకవర్గాలకు చెందిన ఈఆర్వోలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల సీఈవో అన్ని జిల్లాల్లో ప్రత్యేక సంక్షిప్త సవరణ-2024 పురోగతిని సమీక్షించారు. కాకినాడ జిల్లాలో ఎస్ఎస్ఆర్-2024కి సంబంధించి వివిధ అంశాలను జిల్లా కలెక్టర్..సీఈవోకు వివరించారు. మార్పులు చేర్పులు తొలగింపు అభ్యంతరాలకు సంబంధించి ఫారం-6, 7, 8 పరిష్కారాలు, ముసాయి దాపై రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి అందిన దరఖాస్తులకు పరిష్కారం, మీడియా కథనాలు, ఎపిక్ కార్డులు ముద్రణ, పంపిణీ, 18-19 సంవత్సరాల మధ్య ఉన్న ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్, నోడల్, సెక్టోరల్ అధికారులు నియామకం, ఫోటో, డెమోగ్రాఫికల్ సిమ్లరీ ఎంట్రీలు, పది అంతకంటే ఎక్కువ ఒకే డోర్ నెంబర్ ఉన్నవి వంటి అంశాలపై పురోగతిని జిల్లా కలెక్టర్..సీఈవోకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరిస్తూ జిల్లాలో ప్రత్యేక సంక్షిప్త సవరణ-2024 ప్రక్రియను చేపడుతున్నామన్నారు. ప్రధానంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించే లక్ష్యంతో ఈ నెల 2, 3 తేదీల్లో రెండు రోజుల పాటు ప్రత్యేక ఓటు నమోదు శిబిరాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు నమోదైన ఫారమ్-6, 7, 8 దరఖాస్తుల పరిశీలన, పరిష్కారాలను గడువులోపు పూర్తి చేయ నున్నట్టు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి కె.శ్రీధరరెడ్డి, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఈఆర్వోలు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం డీటీ ఎం.జగన్నాథం, ఇతర సహాయక సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర - ఆలమూరు : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆలమూరు మండలంలోని బడుగువానిలంక గ్రామంలో ఇటీవల కోమటి మాణిక్యానికి సంబంధించిన తాటాకు ఇల్లు అగ్ని ప్రమాదానికి గురవడంతో శుక్రవారం వైసీపీ గ్రామ కమిటీ ప్రెసిడెంట్ వీర్రాజు నిరాశ్రయులైన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధైర్యపడవద్దు అని, కుటుంబానికి అండగా వైయస్సార్ ప్రభుత్వం ఉంటుందన్నారు. అనంతరం ఆయన సొంత నిధుల ద్వారా తక్షణ ఆర్థిక సహాయంతో పాటుగా,25 కేజీలు బియ్యం, నిత్యవసర వస్తువులు, దుస్తులను అందజేశారు. అయన వెంట వైఎస్ఆర్సిపి నేతలు కటారి గంగరాజు, నాగిరెడ్డి సాయి, సింగారపు గంగరాజు, తదితరులు అభినందించారు.

ఎయిడ్స్ రహిత సమాజమే అందరి లక్ష్యం

విశాలాంధ్ర - ఆలమూరు : ఎయిడ్స్ రహిత సమాజమే లక్ష్యంగా ప్రత్యేక కృషి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి అందరూ సమిష్టిగా సహకరించాలని ఆలమూరు సీహెచ్‌సీ వైద్యాధికారి పి.గోపిరామ్, చొప్పెల్ల, పెద్దపళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి. సువర్చలాదేవి, ఆర్ .మల్లిఖార్జున్, డి.సాయి కిషోర్ అన్నారు. ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయా పరిధిలో వైద్యారోగ్య సిబ్బంది శుక్రవారం బారీ ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారులు పాల్గొని ఎయిడ్స్ మహమ్మారి వలన ఎదురయ్యే దుష్పరిణామాలను, కలిగే అనార్థాలను వివరించి నిర్మూలనకు తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేశారు. హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

ఒలింపియాడ్ పరీక్షల్లో సివి రామన్ విద్యార్థులు

విశాలాంధ్ర - అమలాపురం : ఎస్ఓఎఫ్ ఫౌండేషన్ వారి ఐఈఓ ఇంటర్నేషనల్ ఇంగ్లీష్ ఒలింపియాడ్ పరీక్షలలో సర్ సివి రామన్ విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో అత్యద్భుతమైన ర్యాంకులు సాధించ డంతో పాటు సెకండ్ లెవెల్‌లో జరగబోయే పరీక్షకు అర్హత సాధించారు. విజేతలైన జి. సంజనా దేవి ఇంటర్నేషనల్ ర్యాంక్ 178, బి వేదిక ఇంటర్నేషనల్ ర్యాంక్ 356, మోరం దివిజ ఇంటర్నేషనల్ ర్యాంక్ 486, స్కూల్ డైరెక్టర్ ఆర్. వేణుగోపాలరావు, ప్రిన్సిపాల్ ఎన్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ కె. పెద్దిరాజు, సత్య కుమార్, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు అభినందించారు.

మోదీ పాలనలో దేశం సర్వతోముఖాభివృద్ధి

విశాలాంధ్ర - అనపర్తి : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనలో దేశం సర్వతో ముఖాభివృద్ధి సాధించడమే కాకుండా అభివృద్ధి, సంక్షేమంతో కూడిన జనరంజక పాలన అందిస్తుందని బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు మేడపాటి హరి నారాయణరెడ్డి, జిల్లా కార్యదర్శి కొవ్వూరి సత్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం వికసిత్ భారత సంకల్పయాత్ర స్థానిక పంచాయతీ ఆవరణలో సర్పంచ్ వారా కుమారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో తహసిల్దార్, ఎంపీడీవో, ఈవో మాట్లాడుతూ వివిధ శాఖలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అర్హులందరూ ఉపయోగించుకోవాలని సూచించారు.పార్టీనియోజవర్గ కన్వీనర్ శివ రామ కృష్ణంరాజు మాట్లాడుతూ 2047 నాటికి దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చడమే వికసిత్ భారత్ సంకల్పయాత్ర ప్రధాన ఉద్దేశమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చిర్ల వీర్రాఘవరెడ్డి, బిజెపి నేతలు వెంకటరమణ, పెదపూడి రాజు, గొలుగూరి సత్యనారాయణరెడ్డి, తమలంపూడి దొరబాబు, సబ్బెళ్ళ సతీష్ రెడ్డి, పలువురు ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అందరికీ మేలు చేసే ముఖ్యమంత్రి జగన్

విశాలాంధ్ర - జగ్గంపేట : అందరికీ మేలు చేసే ముఖ్యమంత్రి జగన్ అని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. జగ్గంపేట మండలం సీతానగరం గ్రామంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించి సచివాలయం 4 పరిధిలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగరవేశారు. అనంతరం వార్డుల్లో పర్యటించి జగనన్న ప్రభుత్వ పనితీరు పట్ల ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటిబాబు మట్లాడుతూ పేద ప్రజలకు నిరంతరం సంక్షేమ పథకాలు అందించేందుకు జగనన్నే ముఖ్యమంత్రిగా ఉండాలని స్పష్టం చేసారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ వసంత్ కుమార్, తదితర అధికారులు, ఉపసర్పంచ్ బందారు రాజా, కాకినాడ జిల్లా జెసిఎస్ కో అర్డినేటర్ ఒమ్మి రఘురామ్, క్రిస్టియన్ మైనార్టీ కోపరేషన్ డైరెక్టర్ జాన్ వెస్లీ, సచివాలయం కన్వీనర్ కరుటూరి వీర్రాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రమాదేవి కుటుంబాన్ని ఆదుకుంటాం

విశాలాంధ్ర-దేవరపల్లి: ఆశ వర్కర్ రమాదేవి కుటుంబాన్ని తెలుగుదేశం పార్టీ ఆదుకుంటుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల పురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకటరాజు పేర్కొన్నారు. దేవరపల్లిలో శుక్రవారం గత 11 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న ఆశ వర్కర్లకు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మద్దిపాటి వెంకట్ రాజు మాట్లాడుతూ అతి సామాన్య కుటుంబంలో జన్మించిన శిలబోయిన రమాదేవి ఇటీవల మృతి చెందారని ఆశ వర్కర్ గా ఆమె అనేక సేవలు అందించారని తెలిపారు. రమాదేవి కుటుంబానికి తమ వంతుగా 25 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవరపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఆండ్రు అనిల్, నేతలు పాల్గొన్నారు.

అవగాహనతో ఎయిడ్స్ నియంత్రణ

కలెక్టర్ డాక్టర్ మాధవీలత

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్ : హెచ్ఐవి /ఎయిడ్స్ బారిన పడిన వారిపై వివక్షత చూపకుండా వారికి పూర్తిస్థాయి జీవితాన్ని కొనసాగించే విధంగా వారికి అండగా ఉంటూ అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక కంబాల చెరువు పార్క్ లో హెచ్ఐవి /ఎయిడ్స్ నియంత్రణపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ కే మాధవీలత, జిల్లా ఎస్పీ జగదీష్, మున్సిపల్ కమిషనర్ కే.దినేష్ కుమార్, డి.ఎల్.ఎస్.సి. కార్యదర్శి కె. ప్రత్యూష కుమారి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ కె. మాధవీలాత మాట్లాడుతూ, హెచ్ఐవి ఎయిడ్స్ బారిన పడిన వారి పట్ల వివక్షత చూపకుండా పూర్తిస్థాయి జీవితాన్ని అందించే విధంగా కృషి చేయాలన్నారు. ఎయిడ్స్ బారిన పడిన వారికి సహాయాన్ని అందించి వారికి అండగా నిలవాలని తెలిపారు. జిల్లా ఎస్పీ పి. జగదీష్ మాట్లాడుతూ ఎయిడ్స్ బారిన పడిన పిల్లలను సమాజంలోని విద్యాసంస్థలు, ఇతర సంస్థల్లో వారి పట్ల ఎటువంటి వివక్షతకు తావు లేకుండా ప్రేమానురాగాలు చూపించి వారికి అండగా వుండే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.జిల్లా నాయిసేవాధికారి సంస్థ కార్యదర్శి కె. ప్రత్యూష కుమారి మాట్లాడుతూ హెచ్ఐవి/ ఎయిడ్స్ బారిన పడిన వారికి మంచి వైద్య పరీక్షలు, రక్షణను అందించాలని అన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ కె. దినేష్ కుమార్ మాట్లాడుతూ ప్రజలందరూ కలిసికట్టుగా ఎయిడ్స్ నిర్మూలనకు కృషి చేయాలని విజ్ఞప్తి చేవారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ టీవీ నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్. వసుంధర, డ్వామా పిడి పి. జగదాంబ, మహిళా ప్రత్యేక జైల్ సూపరింటెండెంట్ సిహెచ్. వసంత కుమారి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, నగర ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజాన్ని స్థాపిద్దాం

విశాలాంధ్ర - జగ్గంపేట : సమాజం నుండి హెచ్ఐవి ఎయిడ్స్‌ను తరిమికొట్టి ఎయిడ్స్ రహిత సమాజాన్ని స్థాపిద్దామని జగ్గంపేట ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల అభివృద్ధి కమిటీ కార్యదర్శి ఒమ్మి రఘురామ్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్స వం సందర్భంగా ప్రభుత్వ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, సాస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినీ విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. జగ్గంపేట మండల పరిషత్ కార్యాలయం నుండి ప్రధాన కూడలి వరకు నిర్వహించి జగ్గంపేట సెంటర్‌లో మానవహారం చేపట్టారు. ఈ సంధర్భంగా రఘురామ్ మాట్లాడుతూ ఎయిడ్స్ అంటు వ్యాధి కాదని అంటించు కొనే వ్యాధి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వసంత్ కుమార్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, సాస్ పిడి యళ్ల పద్మాలత, సంస్థ పియం బి శైలజ, ఓడబ్ల్యులు, పిఈలు, పోలీసు సిబ్బంది, జగ్గంపేట సిహెచ్‌సి సిబ్బంది, జూనియర్ కళాశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక

విశాలాంధ్ర - కిర్లంపూడి : కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక శుక్రవారం తూతూ మంత్రంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డ్వామా పిడి అడపా వెంకటలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ వేదికలో 2022-23 సంవత్స రంలో మండ లంలో 876 పనులు చేపట్టగా 11 కోట్ల 84 లక్షల 27,వేలు ఉపాధి హామీ నిధులు ఖర్చు చేసినట్లు తెలిపారు. దీనిపై సామాజిక తనిఖీ ప్రజావేదిక మండల కేంద్రమైన కిర్లంపూడి మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించారు. తొలుత జగపతినగరం పంచాయతీ పరిధిలో చేపట్టిన ఉపాధి పనులపై డిఆర్‌పి దేవిద్రాజు వివరిస్తుండగా మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబుతో పాటు కిర్లంపూడి, చిల్లంగి, జగపతినగరం గ్రామాలకు చెందిన రైతులు కంపరపు నాగేశ్వరరావు, దాడి ప్రసాద్, నైదాన బాబ్జి, తదితరులు జగపతినగరం పంచాయతీ పరిధి ఉపాధి హామీలో సుమారు 83 లక్షలు రూపాయలు అవినీతి చోటుచేసుకుందని దీనిపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. డ్వామా పిడి అడపా వెంకటలక్ష్మి స్పందిస్తూ ఏపీడి స్థాయి అధికారితో విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం నిర్వహించిన సామాజిక తనిఖీ వేదికలో ఉపాధి హామీ సిబ్బంది నుండి 19300, రూపాయలు, పంచాయతీరాజ్ డిపార్ట్మెంట్ నుండి 17999 రూపాయలు పీడీ రికవరీకి ఆదేశించినట్లు ఏపీవో నాగమణి తెలిపారు. ఈ కార్యక్రమంలో జగపతినగరం సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత, ఈవోపీఆర్డి, మార్కండేశ్వర రావు, డిపిఎం భరత్, ఏపీడి భాను ప్రకాష్, ఏపీవో చిరంజీవిరావు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రగతిపథంలో రాష్ట్రం

విశాలాంధ్ర - గోకవరం : సీఎం జగన్ ఆధ్వర్యంలో రాష్ట్రం ప్రగతి పథంలో పయనిస్తున్నదని ఎమ్మెల్యే చంటిబాబు అన్నారు. రాష్ట్రంలో పేద ప్రజలకు ఏ ముఖ్యమంత్రి చేయలేని విధంగా జగన్మోహన్ రెడ్డి అభివృద్ధి పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. మండలంలోని గోకవరం, గుమ్మల దొడ్డి గ్రామాల్లో 100 మంది నిరుపేదలకు కేటాయించిన భూ శాశ్వత హక్కు పత్రాలను ఎమ్మెల్యే చంటిబాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గుమ్మల దొడ్డి గ్రామంలో వైసీపీ పతాకాన్ని ఎగరవేశారు. గుమ్మల్ల దొడ్డి గ్రామ సచివాలయంలో రాష్ట్ర ప్రగతిని వివరిస్తూ ఏర్పాటుచేసిన డిజిటల్ సైన్ బోర్డులను ఎమ్మెల్యే చంటిబాబు ఆవిష్కరించారు. నిరుపేదలకు కూడా త్వరలోనే ఇళ్లపట్టాలు పంపిణీ చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబు, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ రమేష్, మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి సుబ్బారావ తదితర వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో న్యాయ విజ్ఞాన సదస్సు

విశాలాంధ్ర-కొవ్వూరు : హైకోర్టు ఆదేశాల మేరకు కొవ్వూరు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో శు క్రవారం స్థానిక ప్రభుత్వాసు పత్రిలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. వరల్డ్ ఎయిడ్స్ డే సందర్భంగా నిర్వ హించిన సదస్సులో ముఖ్యఅతిథిగా ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జె.టి.ఎస్. దేవి పాల్గొన్నారు. ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. అనంతరం రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ సాయి కరణ్, న్యాయవాదులు ఎం. శ్రీవల్లి, పి. హరీష్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి

విశాలాంధ్ర - పెద్దాపురం : ఎయిడ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని దివిలి బిఎస్ఆర్ డిగ్రీ కళాశాల చైర్మన్ మొయిళ్ళ చంటి, ప్రిన్సిపాల్ మొయిళ్ళ రాంబాబు అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా బిఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో ఎయిడ్స్ పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి మహమ్మారికి గురై ఎంతోమంది యువకులు చిన్న వయసులోనే ప్రాణాలు పోగొట్టుకున్నారన్నారు. ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణకు సమిష్టి కృషి

జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా

విశాలాంధ్ర - కాకినాడ : ఎయిడ్స్ ప్రభావిత వ్యక్తుల్లో మానసిక ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడంతో పాటు హెచ్ఐవి, ఎయిడ్స్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డా.కృతికా శు క్లా పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం పురస్కరించుకుని జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ యూనిట్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో శాసనమండలి సభ్యురాలు కర్రి పద్మశ్రీ, జిల్లా కలెక్టర్ డా.కృతికా శుక్లా, జెఎన్టీయుకే వీసీ డాక్టర్ ప్రసాద్ రాజు, జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎయిడ్స్ ప్రభావిత చిన్నారులలో ఆత్మవిశ్వాసం నింపేం దుకు కమ్యూనిటీ లంచ్ ఏర్పాటు చేశారు. చిన్నారులతో కలిసి కలెక్టర్, ఎమ్మెల్సీ, జేఎన్టీయూకే వీసీ, ఎస్పీ, జేసీ, వివిధ సంస్థల కార్పొరేట్ సామాజిక బాధ్యత విభాగాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అధికారులు మధ్యాహ్న భోజనం చేశారు. మీకు అండగా మేమున్నామంటూ భరోసా కల్పించారు. ఓఎన్జీసీ, భీమబాయి మహిళా మండలి సంస్థ సమకూర్చిన న్యూట్రిషన్ కిట్లను చిన్నారులకు అందించారు. అనంతరం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం పురస్కరించు కుని ఉత్తమ సేవలు అందించిన సిబ్బందికి ప్రశంసా పత్రాలు అంద జేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జె. నరసింహ నాయక్, డీసీహెచ్ఎస్ డా.స్వప్న, జీజీహెచ్ సూప రింటెండెంట్ డాక్టర్ లావణ్య కుమారి, జిల్లా ఎయిడ్స్, లెప్రసీ అధికారి డాక్టర్ ఆర్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రాతో క్రీడాప్రతిభకు అవకాశాలు

విశాలాంధ్ర-కొవ్వూరు : క్రీడాకారుల్లో దాగియున్న ప్రతిభను వెలికితీసి జాతీయ, అంతర్జాతీయ క్రీడా కారులుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత తెలిపారు. ఈ క్రీడా పోటీలను గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో డిసెంబర్ 15వ తేదీ నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని అందరూ విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం హోంమంత్రి క్యాంపు కార్యాలయంలో ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా హోంమంత్రి తానేటి వనిత మాట్లాడుతూ... గ్రామీణ స్థాయి నుంచి క్రీడాకారుల్లో ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పోటీలను నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. యువత క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఆరోగ్యంగా ఉండా లని, శరీర ధృడత్వం పెంచుకోవాలని ఆమె ఆకాంక్షించారు.

పన్నులు సకాలంలో చెల్లించి సహకరించండి

విశాలాంధ్ర - కాకినాడ : నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన ఆస్థిపన్ను, కుళాయి పన్ను, ఖాళీస్థలాల, నీటి పన్నులను సకాలంలో చెల్లించి సహకరిం చాలని కార్పొరేషన్ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్థానిక స్మార్ట్‌సిటీ కార్యాలయంలో శుక్రవారం పన్ను వసూళ్ళపై సంబంధిత అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక సంవత్సరం ముగింపు దగ్గర పడుతున్నందున పన్ను చెల్లింపుదారులు సకాలంలో పన్నులు కట్టి సహకరించాలన్నారు. రోడ్లు, డ్రైన్లు వంటి మౌళిక సదుపాయాలతో పాటు మంచినీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, పారిశుద్ధ్యం సహా ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో సకాలంలో చెల్లించే పన్నులే ప్రధాన భూమిక వహిస్తాయన్నారు. నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా సచివాలయాల వారీగా పన్నుల వసూళ్ళకు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని ఆయన సంబంధిత అధికారులు, సిబ్బందికి ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, రెవెన్యూ అధికారులు చెక్కా రమణ, నిర్మలాకుమారి, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు, ఆయా సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

తాపీ పనివారల సంఘం అధ్యక్షునిగా శంకర్

విశాలాంధ్ర - ఏలేశ్వరం : అత్యంత ప్రతిష్టాత్మంగా స్థానిక వెంకటేశ్వర కళ్యాణ మండపంలో శుక్రవారం జరిగిన ఏలేశ్వరం తాపీ పనివారల సంఘం నూతన అధ్యక్షుడిగా నందికొమ్ము నాగ శంకర్ విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో అధ్యక్ష పదవికి నలుగురు పోటీ పడగా ఎక్కువ ఓట్లు సాధించిన శంకర్ ప్రెసిడెంట్ గాను, అతని తర్వాత స్థానం పొందిన దనేడి చిన్న కార్యదర్శిగా, పలికెల శ్రీను సహాయ కార్యదర్శిగా, శిడగం శ్రీను కోశాధికారిగా, గెద్ద శ్రీనులతోపాటు గౌరవ అధ్యక్షులుగా కర్రోతు మన్నియ్య, పెమ్మాడ కొండబాబు, గుసిడి శివ, పతివాడ సత్యనారాయణ, యల్లంశెట్టి రాములను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో 600 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు శంకర్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం నుండి రావలసిన రాయితీలు, బీమా, కార్మిక కాలనీ, కమ్యూనిటీ నిర్మాణాలకు కలిసికట్టుగా పోరాడుతామని అన్నారు. అనంతరం గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన

విశాలాంధ్ర-పెరవలి : పెరవలి మండలం మల్లేశ్వరం గ్రామంలో 3.54 కోట్ల రూపాయలతో మంజూరు చేయించిన ఎలక్ట్రికల్ 33/11 సబ్-స్టేషన్ నిర్మాణముకు నిడదవోలు శాసనసభ్యులు జి. శ్రీనివాస నాయుడు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ 33/11 కెవి సబ్ స్టేషన్ ప్రారంభం అయిన వెంటనే సుమారు 240 అగ్రికల్చర్‌కు సంబంధించిన కనెక్షన్లు, 4000 ఇళ్లకు కనెక్షన్లు ఇస్తారని చెప్పారు. ఈ సబ్‌స్టేషన్ వల్ల 7 గ్రామాలు ఈ సదుపాయం పొందుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థల ధాతలు వంకా రాజకుమారి గ్రామ సర్పంచ్,ఎంపీపీ, మండల పార్టీ అధ్యక్షులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, పెరవలి మండలం సర్పంచులు, మరియు ఎంపీటీసీలు నాయకులు విద్యుత్ శాఖ అధికారులు స్థానికులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర - మామిడికుదురు : పాశర్లపూడి పిఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులు తాము పండించిన ధాన్యాన్ని అమ్ముకోవా లని పాశర్లపూడి పీఏసీఎస్ చైర్ పర్సన్ యూవీవి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసి నెల్లి దుర్గా ప్రసాద్, మాజీ సర్పంచ్ మొల్లేటి త్రిమూర్తులు, వైసీపీ గ్రామ శాఖ అధ్యక్షులు చిక్కం బుజ్జి, సొసైటీ సీఈవో యర్రంశెట్టి ఏసురావు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతును శాస్త్రవేత్తగా చేయడమే పొలంబడి లక్ష్యం

విశాలాంధ్ర - గోపాలపురం : రైతును తన పొలంలో తనను శాస్త్రవేత్తగా చేయడమే పొలంబడి ప్రాథమిక ఉద్దేశమని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు తెలిపారు. పొలంబడి క్షేత్ర దినోత్సవంలో భాగంగా కొవ్వూరు పాడు గ్రామంలో సర్పంచ్ శ్రీ చిలకా లక్ష్మణ స్వామి ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డి.ఏ.ఓ మాట్లాడుతూ రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు ఇచ్చే విధంగా వారు చేస్తున్న వ్యవసాయ విధానాల్లో చిన్న చిన్న మార్పులను చేసి తక్కువ ఖర్చుతో నికర ఆదాయాన్ని పెంపొందించే దిశగా విత్తు నుండి విత్తనం వరకు అనగా సుమారు 14 వారాలు ప్రతి వారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహిస్తూ అక్కడ ఉన్న వాతావరణ, వ్యవసాయ పంటల పరిస్థితుల దృష్ట్యా రైతు సోదరులకు తర్ఫీదును ఇస్తూ వారిని ముందుకు నడిపించే విధంగా పొలంబడి కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వ హిస్తుందని తెలిపారు. వ్యవసాయ సహాయ సంచాలకులు కొవ్వూరు పి.చంద్రశేఖర్ మాట్లాడుతూ రైతులు రానున్నటువంటి రబీ సీజన్లో వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంట లైన అపరాలను సాగు చేసుకోవాలని నీటి వసతి ఉన్నటువంటి భూములలో బోర్ల కింద మొక్కజొన్న వేసుకోవడం శ్రేయస్కరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సూర్యనారాయణ, ఎ.ఓ బి. రాజారావు, వి.ఏ.ఎ. డి.సురేష్ పొలంబడి రైతులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్ర కిట్ల పంపిణీ

విశాలాంధ్ర - సీతానగరం: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆడు దాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎంపిడిఓ అధ్యక్షతన ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, జెడ్పీటీసీ చలమల వెంకటలక్ష్మి అధ్వర్యంలో క్రీడలకు సంబంధించి కిట్లను 20 గ్రామ సచివాలయాలు అధికారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామాలలో క్రీడాకారులను వెలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని చేపట్టిందని అన్నారు. ఈ అవకాశాన్ని గ్రామాలలో ఉన్న యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బాబు, వైస్ ఎంపీపీలు సత్యం మదన్ మోహన్, సురేష్ రాజు తహశీల్దార్ కృష్ణారావు, అన్ని గ్రామాల పంచాయితీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడ్స్ బాధితులపై చిన్నచూపు తగదు

విశాలాంధ్ర - రాజానగరం : ఎయిడ్స్ బారిన పడిన బాధితుల పట్ల సమాజంలో చిన్నచూపు తగదని ఎంపీ మార్గాని భారత్ అన్నారు.ప్రపంచ ఎయిడ్స్ డే పురస్కరించుకొని మండలంలోని జిఎస్ఎల్ వైద్య కళాశాల తలపెట్టిన అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ మాట్లాడుతూ ఎయిడ్స్ అంటే సమాజంలో వున్న న్యూనతాభావాన్ని(చిన్న చూపు)తొలగించేందుకు వైద్యులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిఎస్ఎల్ విద్య సంస్థల అధినేత డాక్టర్ గన్ని భాస్కర రావు మాట్లాడుతూ హెఐవి సోకిన వ్యక్తులు ఆ వైరస్ ఎయిడ్స్‌గా మారక ముందే సరైన వైద్యం పొందడం ద్వారా జీవన కాలాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. దీనిలో భాగంగా వివిధ జబ్బులతో ఇబ్బందులు పడుతున్న రోగులను ఆసుపత్రికి తీసుకు రావడంలో కీలక పాత్ర పోషించే డ్రైవర్లను,వార్డు బాయ్ లను ఆయాలను సత్కరించారు. తొలుత రాజానగరంలోని గాంధీ బొమ్మ కుడాలి వద్ద జిఎస్ఎల్ వైద్య విద్యార్థులు వివిధ కార్యక్రమాలు చేపట్టారు. ప్రజలకు ఎయిడ్స్ పై అవగాహన కల్పించారు. వీధినాటికలు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు.

KAKINADA MUNICIPAL CORPORATION
'e' Procurement Notification

ROC. No.31372/2023/E2, **Dt : 30-11-2023**

Tenders invited through ap e procurement platform for 16 woks with an estimated contract value of **Rs. 96,09,119/-** from the eligible contrnctors in the following manner.

Sixteen Works for an amount of Rs. 96,09,119/-

Last date and time for downloading did documents : **11.12.2023 upto 02-00PM**
Last date and time for submission of bids : **11.12.2023 upto 02-30PM**

Tender Inviting Authority : **Commissioner, Municipal Corporation, Kakinada.** Mail : Call Centre Phone : 0884-2357722. **Further Details can be seen at 'e' procurement market place @ www.apeprocurement.gov.in**

Sd. CH. Naga Narasimha Rao (FAC),
Commissioner
Municipal Corporation, Kakinada

పలు కళాశాలల్లో ఎయిడ్స్ డే

విశాలాంధ్ర -భీమవరం: డి.యన్.ఆర్. కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళా శాల సెక్రెటరి గాదిరాజు బాబు, ఉపాధ్యక్షులు జి.పాండురంగరాజు హెచ్ఐవిపై ప్రజల్లో అవగాహన కలిగించాలని సూచించారురు. పాలకవర్గ సభ్యులు పి.రామ కృష్ణంరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ శాంతకుమారి ఎన్ఎస్ఎస్ అధికారులు చెల్లబోయిన రంగారావు, అనిల్ దేవ్, కె.సత్యనారాయణ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్.ఆర్.డి.ఎస్.ప్రభుత్వ కళాశాలలో: ఆర్.ఆర్.డి.ఎస్.ప్రభుత్వ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కె.జె.ప్రసూన మాట్లాడుతూ ఎయిడ్స్ మహమ్మారిని సమాజం నుండి తరిమికొట్టాలన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రతిజ్ఞ, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎస్.లక్ష్మీకాంతం, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ కాకుమాని శ్రీనివాసరావు, డాక్టర్ పి.రాజశేఖర్, డాక్టర్ అరవిందకుమార్, పి.అమూల్యరావు, ధనుంజయ్, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ సిఎస్ఎన్ కళాశాలలో : డాక్టర్ సిఎస్ఎన్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ కరస్పాండెంట్ డాక్టర్ చీదే సత్యనారాయణ మాట్లాడుతూ సమాజానికి ఎయిడ్స్ పట్ల అవగాహన కలిగించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సకుమళ్ల సత్యనారాయణ, బొమ్మదేవర ప్రభాకర్ రావు, చెరుకువాడ రంగసాయి, జితేంద్ర, దుర్గాప్రసాద్, నందమూరి రాజేష్, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఏలూరులో :ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా ఎయిడ్స్, క్షయ నియంత్రణ శాఖ అధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె. రత్న ప్రసాద్ తో కలిసి డిఎంహెచ్ఓ డాక్టర్ శర్మిష్ఠ జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక ఇండోర్ స్టేడియం వద్ద ఎయిడ్స్‌ను నియంత్రించాలని శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. హెచ్ఐవి ఎయిడ్స్ పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లా ఎయిడ్స్, టి.బి. నియంత్రణ అధికారి డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ అసమానతలను అంతం చేద్దాం.. ఎయిడ్స్‌ను నిర్మూలిద్దాం అనే నినాదంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎయిడ్స్ నియంత్రణ కోసం పాటుపడుతున్న పలు సంస్థల ప్రతినిధులు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఎడి రాకాడ మణి, క్రీడాభివృద్ధి సంస్థ ఛీఫ్ కోచ్ బి. శ్రీనివాసరావు ఒడ్ క్రాస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముదినేపల్లిలో: ఎయిడ్స్ నియంత్రణకు అవగాహన కల్పించాలని ముదినేపల్లి ఎస్సై డి వెంకట్ కుమార్ అన్నారు.ఏపీఎస్ ఏసిఎస్ వారి ఆధ్వర్యంలో రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం వారి సౌజన్యంతో అంతర్జాతీయ హెచ్ఐవి, ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీస్ స్టేషన్, సచివాలయం, పిహెచ్సి సిబ్బంది ఎర్ర రిబ్బన్లు ధరించి ఎయిడ్స్ నిరోధానికి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ముదినేపల్లి సచివాలయం పరిధిలో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీలు నిర్వహిం చారు. ఎయిడ్స్ రోగుల పట్ల వివక్షత చూపకుండా వారిని ఆదరించాలని ఎస్సై అన్నారు. వైసిపి రాష్ట్ర నాయకులు నిమ్మగడ్డ బిక్షాలు మాట్లాడుతూ ఎయిడ్స్ బాడిన పడకుండా యువత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లింక్ వర్కర్స్ సిహెచ్ నాగలక్ష్మి, చంద్రావతి, వైద్య సిబ్బంది , మహిళలు , గ్రామస్తులు పాల్గొన్నారు.

పాలకొల్లులో: ప్రపంచ హెచ్ఐవి దినోత్సవం సందర్భంగా పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు పర్యవేక్షణలో ధర్మారావు ఫౌండేషన్ అధ్వర్యంలో శుక్రవారం హెచ్ఐవి బాధితులకు పౌష్టికాహారం నిత్యావసరాలు పంపిణీ చేసే కార్యక్రమం జరిగింది. స్థానిక క్లాత్ మర్చంట్ భవనంలో సుమారు 100 మంది హెచ్ఐవి బాధితులకు పౌష్టికాహారాన్ని ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో కోడి విజయ భాస్కర్, గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు, కామిశెట్టి అయ్యప్ప నాయుడు పాల్గొన్నారు.

గణపవరంలో : ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ పై అవగాహన పెంచుకోవాలని పశ్చిమగోదావరి జిల్లా సిపి పిహెచ్సి(పిఎంపి) జిల్లా అధ్యక్షులు ఏ ఆర్ కె పరమేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని పశ్చిమగోదావరి జిల్లా, గణపవరం మండలం (పిఎంపి అసోసియేషన్) సి పి పిహెచ్ పి, ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గణపవరం వారి సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పిఎంపి అసోసియేషన్ గణపవరం మండల అధ్యక్షులు మండా సత్యనారాయణమూర్తి, సెక్రెటరీ వి. శివ శ్రీనివాసరావు, గణపవరం పీహెచ్ సివైద్యాధికారి డాక్టర్లు పి. హెచ్ ఆర్ ఎస్ సంతోష్ నాయుడు, సి హెచ్ ఓ జె విల్సన్ బాబు, ఎం ఎస్ యోహాన్ ,కృష్ణ, నల్లయ్య, ప్రభాకర్ రావు, కొటకల అప్పారావు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

తణుకులో : ఎయిడ్స్ వ్యాధికి నివారణ ఒక్కటే మార్గమని స్థానిక ఎస్ కే ఎస్ డి మహిళా కళాశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ అన్నారు. శుక్రవారం ఎస్ కె ఎస్ డి మహిళా కళాశాల ఎన్ సి సి, ఎన్ ఎస్ ఎస్ విభాగాల విద్యార్థినులు ఎయిడ్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి హెచ్ఐవి వైరస్ వల్ల వస్తుందని, మనిషి శరీరంలోని సి.డి 4 కణాలు 200కు కన్నా తక్కువగా ఉన్నప్పుడు మాత్రమే ఈ వ్యాధిని గుర్తించగలమని, వ్యాధి నిరోధక శక్తి క్షీణిస్తుందని తెలిపారు. అనంతరం యన్. సి. సి, యన్. యస్. యస్ విభాగాల విద్యార్థినులు ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ, కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి, యన్. సి. సి ఆఫీసర్ లెఫ్టినెంట్ యు. లక్ష్మీ సుందరి భాయ్, యన్. యస్. యస్ ప్రోగ్రాం ఆఫీసర్ జి. రమ్య, సిహెచ్ రమేష్ బాబు, ఎన్ ఎస్ ఎస్ క్యాడేట్స్, ఎన్సిసి వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

కైకలూరులో : ఎయిడ్స్ నివారణపై అవగాహన తప్పనిసరి ఎయిడ్స్ వ్యాధి నివారణపై ప్రతి ఒక్కరికి అవగాహన తప్పనిసరిని సీనియర్ సివిల్ జడ్జి వి విఎన్‌వి లక్ష్మీ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వాసుపత్రిలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ, బార్ అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు.ఈ సందర్భంగా న్యాయమూర్తి వి వి ఎన్ వి లక్ష్మి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఈ వ్యాధి పట్ల అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.క్షేత్రస్థాయిలో వైద్యులు, వైద్య సిబ్బంది కీలకపాత్ర పోషించాలని సూచించారు.బార్ అసోసియేషన్ అధ్యక్షులు మాడెం వీర వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక చట్టం రూపొందించారన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ చావలి శంకర శాస్త్రి, ప్యానల్ అడ్వకేట్ పి పవన్ కాంత్, డి. శివప్రసాద్, వైద్యులు రమాదేవి,సిబ్బంది ప్రసాద్, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఓటు నమోదుపై స్పెషల్ డ్రైవ్

విశాలాంధ్ర - పాలకొల్లు: పాలకొల్లు నియోజకవర్గంలోని ఓటర్లు ఓటు నమోదు, ఓటర్ల లిస్టులో మార్పు చేర్పులకు సంబంధించి, ఈనెల 2, 3 తేదీల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు పాలకొల్లు ఎలెక్టోరల్ రిటర్నింగ్ ఆఫీసర్ కెసిహెచ్ అప్పారావు తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు, జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి, జిల్లా ఎన్నికల అధికారి నేతృత్వంలో ప్రత్యేక కార్యక్రమాన్ని అనగా శని, ఆదివారాల్లో అన్ని పోలింగ్ స్టేషన్ల సదస్సులు ఏర్పాటు చేశామన్నారు.

ఓటర్ల జాబితాలోని అవకతవకలపై విచారణ జరిపించాలి

విశాలాంధ్ర-తణుకు: నియోజకవర్గ ఓటర్ల జాబితా లోని అవకతవకలను విచారణ జరిపించాలని కోరుతూ తణుకు అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్‌కు తణుకు నియోజకవర్గ తెదేపా ఇన్‌చార్జి, మాజీ శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 27న విడుదల చేసిన డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్ లో ఉన్న ఓటర్ లిస్టు తప్పుల తడకగా ఉందన్నారు. తమ అభ్యంతరాలను పరిగ ణించి రాబోయే తుది ఓటర్ లిస్టులో రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఒమ్మి రాంబాబు, తాతపూడి మారుతీరావు,బట్టపల్లి నాగరాజు, బోళ్ల శ్రీను, శివ తదితరులు పాల్గొన్నారు.

చిన్నంపేటలో రోడ్ల అభివృద్ధి

విశాలాంధ్ర-చాట్రాయి: చిన్నంపేటలో శివపురం రోడ్డులో ఉన్న బలహీన వర్గాలు , ముస్లింల నివాస ప్రాంతాల్లో చిన్నం రామకోటయ్య ఆధ్వర్యంలో రోడ్లను అభివృద్ధి చేశారు. శుక్రవారం చాట్రాయి మండలం చిన్నంపేట గ్రామంలో బలహీన వర్గాలు , ముస్లింల నివాస ప్రాంతాల్లో అంతర్గత రోడ్లను అభివృద్ధి చేశారు.కార్యక్రమంలో చిన్నంపేట మాజీ సర్పంచ్ కునికేరి నాగమల్లేశ్వరరావు (డాక్టర్ బాబు) పాల్గొన్నారు.

వీఆర్వో చిన్నం రామకోటయ్య అనుచరులకు మధ్య వాగ్వాదం

ఇటీవల చిన్నంపేట గ్రామానికి వచ్చిన రామకోటయ్య వద్దకు శివపురం రోడ్డులోని ముస్లిం నివాస ప్రాంతాలకు చెందిన యువకులు రామకోటయ్య వద్దకు వచ్చి మా వీధిలలో కంకర పోయించాలని కోరడంతో స్పందించిన రామకోటయ్య శుక్రవారం మధ్యాహ్నం నుంచి గ్రావెల్ తోలిస్తుండగా చిన్నంపేట వీఆర్వో రహదారిలో ఉన్న గాంధీ విగ్రహం వద్దకు వచ్చి గ్రావెల్ వాహనాలను ఆపడంతో రామకోటయ్య అనుచరులు మాజీ సర్పంచ్ కునికేరి నాగమల్లేశ్వరరావు, సృజన రావులు వీఆర్వోతో మాట్లాడుతూ తాము సొంతానికి తోలుకోవడం లేదని చిన్నం రామకోటయ్య ఆధ్వర్యంలో రోడ్లు అభివృద్ధి చేస్తున్నాం మట్టి తోలుకొని వ్యాపారం చేసేవాళ్లు గ్రావెల్ తోలుతుంటే అప్పుడు మాట్లాడకుండా సహాయం చేసే వాళ్ళను ఆపడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కరాటేలో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-ఏలూరు : సికో షోటోఖాన్ అడ్వాన్స్ కరాటే దు ఇండియా ఆధ్వర్యంలో ఎస్.కె. ఎస్.డి. మహిళా కళాశాల తణుకులో నిర్వహించిన స్టేట్ లెవెల్ టోర్నమెంట్‌లో మొత్తం 1400 మంది పాల్గొనగా స్థానిక శ్రీచైతన్య పాఠశాల, శాంతినగర్ విద్యార్థులు కట్ట, కుమతే విభాగాలలో 14 మంది పాల్గొనగా 16 బంగారు పతకాలు, నాలుగు వెండి పథకాలు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.శివకుమారి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రత్యేక అభినందన సభను ఏర్పాటు చేశారు. చైతన్య విద్యాసంస్థల ఎ. జి ఎం. సుంకర పార్థసారథి,రీజనల్ ఇంచార్జ్ సిహెచ్. ఉదయభాస్కర్, జోనల్ ఎకడమిక్ కోఆర్డినేటర్ సి.హెచ్ .వెంకటేశ్వరరావు విద్యార్థులకు, తల్లిదండ్రులకు, కరాటే మాస్టర్ శ్రీనివాస్‌కు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. సభలో జోనల్ ఎకడమిక్ డీన్ జే .సంజీవ్ కుమార్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్, ప్రైమరీ ఇన్‌చార్జి నరీనా తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లు మరింత బాధ్యతగా పనిచేయాలి

విశాలాంధ్ర-పోదూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు కార్డుదారులకు పనులు కల్పించడంలోనూ రికార్డుల నిర్వహణలోనూ పొరపాట్లకు తావివ్వకుండా బాధ్యతాయుతంగా పని చేయాలని జిల్లా విజిలెన్స్ అధికారి ఏవి విజయలక్ష్మి అన్నారు. పోదూరు మండలంలో 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీ ని శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద జరిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మండల పరిషత్ అధ్యక్షురాలు సబ్బితి సుమంగళి సాగర్ మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లు కార్డుదారులందరికీ సమానంగా పనులు కల్పించాలన్నారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్ టి వి రాజేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాలలో జరిపిన సామాజిక తనిఖీల్లో గుర్తించిన పొరపాట్లను ఫీల్డ్ అసిస్టెంట్లు పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. డిఆర్ డి ఎ జిల్లా అధికారి మురళీ కృష్ణ సోషల్ ఆడిట్ ఎస్ ఆర్ పి కె మన్మధరావు, ఏ సాగర్, ఏ ఆనంద్ , ఎంపీడీఓ కార్యాలయం అకౌంటెంట్ ఎం పల్లారావు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

తుపాను ప్రభావంతో రైతులు అప్రమత్తతతో ఉండాలి

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: రాబోయే మూడు, నాలుగు రోజుల్లో తుపాను ప్రభావం ఉంటుందని, రైతులందరూ కోసిన ధాన్యాన్ని భద్రపరుచుకోవాలని మండల వ్యవసాయాధికారి కే.వి.ఎస్.పోశారావు సూచించారు.శుక్రవారం మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో రైతుల తో సమావేశం ఏర్పాటు చేశారు.లక్కవరం గ్రామంలో సర్పంచ్ గెల్లా వెంకటరమణ అధ్యక్షతన రైతులతో సమావేశం నిర్వహించారు.ఈ సంద ర్భంగా వ్యవసాయాధికారి పోశారావు మాట్లాడుతూ ఈ సార్వా సీజన్లో జంగారెడ్డిగూడెం మండలంలో 11,410 ఎకరాలలో వరి సాగు చేసినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లక్కవరం ఉప సర్పంచ్ నిమ్మ రామకృష్ణ, సొసైటీ అధ్యక్షుడు బడి దుర్గారావు,దల్లి నాగేశ్వరావు,నిమ్మ గుర్నాథరావు, చల్లా దుర్గారెడ్డి, ప్రజా ప్రతినిధులు,రైతులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా

విశాలాంధ్ర-ఆచంట: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం నిర్వహించాలని ఎంపీడీవో ఎన్ నర్సింహ ప్రసాద్ తెలియజేశారు. ఈనెల 15న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి పెద్ద మొత్తంలో రిజిస్ట్రేషన్ జరగాలని ఉద్యోగులకు ఆదేశించారు.ఉద్యోగులు ఈ కార్యక్ర మానికి అనర్హులు అని తెలిపారు.

క్షీరారామంలో లక్ష్మీ గణపతి హెూమం

విశాలాంధ్ర - పాలకొల్లు: పాలకొల్లు పంచారామక్షేత్రం శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం సంకట హర చతుర్థి సందర్భముగా లక్ష్మి గణపతి హెూమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ హెూమంలో 22 మంది దంపతులు పాల్గొన్నారు. వీరికి శ్రీస్వామి వారి శేష వస్త్రములు ప్రసాదములు అందజేశారు. ఈపూజా కార్యక్రమ ఏర్పాట్లను ఆలయ ధర్మకర్తల చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, కార్య నిర్వహణ అధికారి యాళ్ళ సూర్యనారాయణ, పర్యవేక్షించారు. ఈ హెూమాన్ని యాజ్ఞికబ్రహ్మ భమిడిపాటి వెంకన్న దగ్గరుండి నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-దేవరపల్లి: అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం దేవరపల్లి బిహెచ్ఎస్ఆర్ అండ్ వి ఎల్ ఎం డిగ్రీ అండ్ పీజీ కళాశాల విద్యార్థులు ఎయిడ్స్ పై ర్యాలీ నిర్వహించారు కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీ కళాశాల నుండి మెయిన్ రోడ్డు మీదుగా గోపాలపురం సెంటర్ వరకు కొనసాగింది దాదాపు రెండు కిలోమీటర్లు జరిగిన ఈ ర్యాలీలో ఎయిడ్స్ అంటువ్యాధి కాదని అంటించుకునే వ్యాధి అని గట్టిగా నినాదాలు చేశారు ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బీడీఎన్ కుమార్ మాట్లాడుతూ తమ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవం రోజున ర్యాలీలు నిర్వహించారు ఈ సందర్భంగా ఎయిడ్స్ పై తమ కళాశాల విద్యార్థులు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆఫీసర్ పి రాము ఎస్ వెంకటేష్ కే సూర్యరావు అనిల్ రాజు మహేందర్ ఈ శ్రీనివాస్ ఇంకా విద్యార్థులు పాల్గొన్నారు

పరంజ్యోతి ఆదర్శనీయులు

విశాలాంధ్ర - రాజానగరం : ప్రజల సమస్యలపై ప్రతినిత్యం పోరాడిన కామ్రేడ్ గొర్రెల పరంజ్యోతి ఆదర్శనీయులనీ అఖిల భారత రైతు కూలీ సంఘం సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్ అన్నారు.అఖిల భారత రైతు కూలీ సంఘం, సిపిఎంఎల్ న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో మరుకుర్తి వీరలక్ష్మి అధ్యక్షతన విప్లవకారుడు గొర్రెల పరంజ్యోతి 18వ వర్ధంతి వేడుకలనీ పురస్కరించుకుని మండలంలోని పాత తుంగపాడు గ్రామంలో శుక్రవారం జరిగిన వేడుకల్లో ఆయన మాట్లాడుతూ ఆనాటి పోరాట విషయాలను గుర్తు చేసుకున్నారు.జిల్లా అధ్యక్షులు జన్నుపల్లి సత్తిబాబు,జిల్లా నాయకులు మల్లవరపు రాజు మాట్లాడుతూ పరంజ్యోతి గోకవరం నుండి కోరుకొండ వరకు జరిగే భూ పోరాటాలు కూలి పోరాటాలు ఇళ్ల స్థలాలు పోరాటాలు సాగించాడని అనేక విజయాలు సాధించారని చెప్పారు.పరంజ్యోతి ఆశయసాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలనీ పిలుపునిచ్చారు.తొలుత పరంజ్యోతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కుద్దిసేపు మౌనం పాటించారు. ఈ సమావేశంలోఅఖిల భారత రైతు కూలీ సంఘం,సిపిఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహాశక్తి పథకాల ప్రయోజనంపై ప్రచారం

విశాలాంధ్ర - అనపర్తి : టిడిపి మినీ మేనిఫెస్టోలో ప్రకటించిన మహాశక్తి పథకాల ద్వారా మహిళలకు కలిగే ప్రయోజనాలను టిడిపి మహిళా నేతలు ఇంటింటికి వెళ్లి వివరించారు. శుక్రవారం మహేంద్రవాడలో మహాశక్తి పథకాల ద్వారా కలిగే లబ్దిని వివరించి రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి గెలిపించాలని మహిళా నేతలు విజ్ఞప్తి చేశారు.కాగా వైసిపి నుండి టిడిపిలో చేరిన పలువురికి రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

అభివృద్ధి, సంక్షేమానికి ఏపీ ఆదర్శం

విశాలాంధ్ర - కాకినాడ : అభివృద్ధి-సంక్షేమానికి ఆంధ్రప్రదేశ్ దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ పేర్కొన్నారు. స్థానిక 30వ డివిజన్‌కు సంబంధించి బ్రహ్మం ఆలయం వద్ద సంక్షేమ పథకాల లబ్ధిదారుల సమావేశం శుక్రవారం జరిగింది. కౌడ ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్‌సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ ఛైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు సంబంధించిన ప్రదర్శన ఫలకాన్ని ఎమ్మెల్సీ పద్మశ్రీ, నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏపీ పథకాలను ఇతర రాష్ట్రాలు కూడా ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. కౌడ ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి మాట్లాడుతూ సచివాలయ, వాలంటరీ వ్యవస్థ ద్వారా కుల, మత రాజకీయాలకు అతీతంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శక పాలన అందిస్తున్నారన్నారు. గడచిన నాలుగేళ్ళలో 30వ డివిజన్‌లో రూ.25 కోట్ల విలువైన అభివృద్ధి, సంక్షేమ పథకాల లబ్ధి చేకూరిందన్నారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్ రాగిరెడ్డి బన్ని, త్రిపురసుందరి ఆలయ కమిటీ చైర్మన్ పెద్ది రత్నాజీ, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, పలువురు మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

ఎయిడ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ పోరాడాలి

విశాలాంధ్ర - ఏలేశ్వరం : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నుండి బాలాజీ చౌక్ వరకు శుక్రవారం వైద్యులు వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం బాలాజీ చౌక్ సెంటర్లో మానవహారంగా ఏర్పడి ఎయిడ్స్ రహిత సమాజమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పోరాడాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ శైలజ, వైద్యులు పాపారావు, ఏఎన్ఎం రాజ్యలక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్ యార్లగడ్డ రవి, అనిల్, ఆదిబాబు, జగదీష్, ప్రసాద్, మధు, సిహెచ్, పిహెచ్సి హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

మూలపేటలో వీక్షిత్ సంకల్పయాత్ర

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : వీక్షిత్ భారత్ సంకల్పయాత్ర కొత్తపల్లి మండలం మూలపేట కొత్త మూలపేట గ్రామాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పి.వెంకటనారాయణ మాట్లాడుతూ. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అమలు చేస్తున్న 17 సంక్షేమ పథకాలను ప్రజలందరికీ తెలియజేయాలనే దృఢ సంకల్పంతో జిల్లాలో మూడు వాహనాలను ఏర్పాటు చేశారని తెలియజేశారు. దీనిలో భాగంగా మూలపేట, కొత్త మూలపేటలలో సమావేశం ఏర్పాటు చేసామని ప్రజలకు తెలియజేశారు. ప్రధానమంత్రి కల్యాణ అన్న యోజన, ప్రధానమంత్రి ఉజ్వల గ్యాస్ సరఫరా, ప్రధానమంత్రి జనధన ఖాతాలు, ప్రధానమంత్రి కిసాన్ యోజన, ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం, ప్రధానమంత్రి అటల్ పెన్షన్ యోజన పథకంల ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటనారాయణ, పంచాయతీ విస్తరణాధికారి ఎమ్మెస్ భాస్కర్, వ్యవసాయ అధికారి జోగిరాజు తదితరులు పాల్గొన్నారు.

బావిలో దూకి మహిళ ఆత్మహత్యాయత్నం

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : బావిలోకి దూకి వివాహిత మహిళ ఆత్మహత్య ప్రయత్నం చేసిన సంఘటన కొత్తపల్లి మండలం కుతుకుడు మిల్లీలో శుక్రవారం చోటు చేసుకుంది. కొత్తపల్లి ఎస్ఐ స్వామి నాయుడు తెలిపిన వివరాలు ప్రకారం. కుతుకుడి మిల్లి గ్రామంలో అద్దె ఇంట్లో ఉంటున్న కాకాడ వెంకటలక్ష్మి భర్త కొండా బాబుతో కలిసి నివాసం ఉంటున్నారు. అయితే శుక్రవారం మధ్యాహ్నం వెంకటలక్ష్మి బావిలోకి దూకిన విషయం తెలిసిన వెంటనే కొత్తపల్లి ఎస్సై స్వామి నాయుడు సంఘటన స్థలానికి సిబ్బందితో చేరుకుని నిచ్చెన సహాయంతో యువతని బయటకు తీసి ప్రాణాలను కాపాడి భార్యాభర్తలు ఇరువురికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఎస్సై వెంట వైసీపీ మండల అధ్యక్షులు ఆనాల సుదర్శన్. రైటర్ శ్రీనివాసు పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు, ఎల్లుండి ఓటరు నమోదు ప్రత్యేక డ్రైవ్

విశాలాంధ్ర - సామర్లకోట : డిసెంబర్ 2, 3 తేదీలు శని, ఆది వారాల్లో కొత్త ఓటరు నమోదు, జాబితాల సవరణకు సంబంధించి ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్టు సహాయ ఎన్నికల అధికారి తహసిల్దార్ ఎస్ఎల్ఎన్ కుమారి తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆమె ఒక ప్రకటనలో తెలుపుతూ ఎన్నికల సంఘం సూచనల మేరకు శని, ఆది వారాల్లో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు బూత్ లెవెల్ అధికారులు ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ అందుబాటులో ఉంటారన్నారు. 2024 జనవరి ఒకటో తేదీకి 18 సంవత్సరాల నిండి ఇప్పటివరకు ఓటు నమోదు చేసుకొని వారు ఫారం-6 ద్వారా ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే వాటర్ జాబితాలో మార్పులు, చేర్పులు, సవరణలకు సంబంధించి ఫారం-8 ద్వారా ఓటర్లు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మండల పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో రెండు రోజులపాటు బిఎల్వోలు అందుబాటులో ఉంటున్నందున ఓటర్లు వారి సేవలను వినియోగించుకోవాలని ఈ సందర్భంగా తహసిల్దార్ కుమారి తెలియజేశారు.

రబీసాగు పై అవగాహనా సదస్సు

విశాలాంధ్ర - పిఠాపురం రూరల్ : పిఠాపురం మండలం మంగుతుర్తి గ్రామంలో వ్యవసాయ అధికారి ఎస్. విజయ్ కుమార్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. నీటి లభ్యత కొరత కారణంగా రైతులు ఏ విధంగా ముందుగానే జాగ్రత్త పడాలనె విషయంపై వారికి అవగాహన కల్పించడం జరిగింది. వరి బదులుగా మేరక భూముల్లోని అపరాలు సాగు చేయవలసి ఉన్నదిగా సూచించడం జరిగినది దీని ద్వారా రైతులు లాభాన్ని పొందవచ్చని అనంతరం కుమారపురం గ్రామంలోని వరునాట్లు పరిశీలించి రైతులకు సూచనలు సలహాలు ఇచ్చారు. సోమవారం నుండి తుఫాన్ సూచనలు వుండడంతో కళ్ళల్లోని ధాన్యాన్ని ఏ విధంగా భద్రపరచారలి విషయం పై వారికి సవివరంగా వివరించారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ ఏడిఏ పి. స్వాతి, మండల వ్యవసాయ అధికారి ఎ. అచ్యుత్ రావు, వివిఎ దుర్గాప్రసాద్, చిరంజీవి పాల్గొన్నారు.

ఆడుదాం...ఆంధ్రాలో భాగస్వాములు కావాలి

విశాలాంధ్ర - పెద్దాపురం : రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 15వ తేదీ నుంచి చేపట్టే ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో మండలంలోని ఆయా గ్రామాల యువత భాగస్వాములు కావాలని పెద్దాపురం మండల విస్తరణాధికారి కె రాజశేఖర్ అన్నారు. ఆడుదాం ఆంధ్రా క్రీడలకు సంబంధించి మండలంలోని కాండ్రకోట గ్రామంలో శుక్రవారం క్రీడా మైదానం అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరిలో క్రీడా ప్రతిభ ఉంటుందన్నారు. వాటిని వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాల వారీగా క్రీడా పోటీలును నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామీణ యువత క్రీడల్లో పాల్గొని ప్రతిభ కనపర్చి రాష్ట్ర స్థాయిలో పెద్దాపురం మండలానికి గుర్తింపు తీసుకురావాలని ఆయన కోరారు. అనంతరం కాండ్రకోట, పులిమేరు, దివిలి పంచాయతీ కార్యాలయాల్లో ఆడుదాం..ఆంధ్రాపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాండ్రకోట విద్యాకమిటీ చైర్మన్ వీరబాబు, పంచాయతీ కార్యదర్శులు బషీర్. బ్రహ్మం, చిట్టిబాబు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొనారు.

అడుదాం ఆంధ్ర క్రీడాసామాగ్రి పంపిణీ

విశాలాంధ్ర-కొవ్వూరు : ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీల నిర్వహణకు సంబంధించి క్రీడా సామాగ్రిని కొవ్వూరు ఎంపీపీ కాకర్ల నారాయుడు శుక్రవారం అందజేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎంపీడీవో కే సుశీల నియోజకవర్గ కోఆర్డినేటర్ ఎస్.నాగరాజు, పీడీలు ఆలీ, ఎస్. సురేష్, పీటీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-గోకవరం : ప్రపంచ ఎయిడ్స్‌డే సందర్భంగా అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోకవరం, కొత్తపల్లి పి.హెచ్.సి. ఎమ్.పి.హెచ్.ఈ.ఓలు మూర్తి, శంకర్ పాల్గొన్నారు. ఈ సంవత్సరం స్లోగన్ "లెట్ కమ్యూనిటీస్ లీడ్" అనే నినాదంతో ప్రజలందరూ ఎయిడ్స్ ను తరిమికొట్టి సమాజంలో ఆరోగ్య కరమైన అలవాట్లు పెంపొందించుకొని ఎయిడ్స్ నిర్మూలించుటలో ముందడుగు వేయాలని తెలిపి సిబ్బంది అందరితో నినాదాలు చేయించారు. కార్యక్రమంలో ఎమ్.ఎల్.హెచ్.పిలు రమ్య,అనూష హెల్త్ అసిస్టెంట్లు పవన్, రమణ, ఏ.ఎన్.ఎమ్.లు నాగలక్ష్మి,సూర్య శివాజీ, అబ్రహం, ఆశాలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తమ ఆఫరింగ్‌ను మెరుగుపరుస్తున్న గోద్రెజ్ క్యాపిటల్ నిర్మాణ్

విశాలాంధ్ర-రాజమండ్రి: గత దశాబ్దంలో, భారతదేశంలో చిన్న వ్యాపారాల కోసం రుణ లభ్యత అంతరాలను (క్రెడిట్ గ్యాప్)ను తగ్గించడంలో గణనీయమైన పురోగతి సాధించబడింది. భారతీయ వ్యాపారంలో 125 సంవత్సరాలకు పైగా గొప్ప చరిత్ర కలిగిన గోద్రెజ్ గ్రూప్ సవాళ్లను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉంది. గోద్రెజ్ బ్రాండ్‌పై భారతీయ వినియోగదారుల విశ్వాసంతో 'నేషన్-బిల్డింగ్' అనే సిద్ధాంతంతో ముందుకు వెళ్తున్న గోద్రెజ్ క్యాపిటల్, దాని భాగస్వామ్య నెట్‌వర్క్‌ను గణనీయంగా విస్తరించడం ద్వారా తన నిర్మాణ్ ప్లాట్‌ఫారమ్‌పై పెద్ద ఎత్తున అంచనాలు పెట్టుకుంది. డీ బీ ఎస్ బ్యాంక్ ఇండియా, వీసా, అమెజాన్ మరియు ఇతర పరిశ్రమల ప్రముఖులతో భాగస్వామ్యాలు ఎం ఎస్ ఎం ఈ యజమానులకు వృద్ధి అవకాశాలను అందించేందుకు కృషి చేస్తోంది.

హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధులపై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : సమాజం నుండి హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి తరిమికొట్టాలని, ఎయిడ్స్ నివారణ బాధ్యత ప్రతి ఒక్కరిదీ అని రాచపల్లి పిహెచ్సి వైద్యురాలు వై గీతా సుధ అన్నారు. ప్రత్తిపాడు మండలం రాచపల్లి పిహెచ్సి వద్ద ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా పిహెచ్సి సిబ్బంది మరియు ప్రత్తిపాడు న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు, న్యాయవాదులు మాట్లాడుతూ సురక్షిత దాంపత్య జీవితం, అక్రమ సంబంధాలకు దూరంగా ఉండడం, భారత దేశ సంస్కృతికి, వివాహ వ్యవస్థకు ప్రాధాన్యత ఇస్తూ జీవిత భాగస్వామితో మాత్రమే దాంపత్య జీవితం కలిగి ఉంటే ఎయిడ్స్ వ్యాధితో భయమే లేదన్నారు. క్రమం తప్పకుండా మందులు వాడితే ఎయిడ్స్ వ్యాధితో ప్రమాదం లేదని సాధారణ జీవితం గడపొచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్లు బి. మాణిక్యం, నారా కుమారి, టీ. వీరన్న ఇతర వైద్య సిబ్బందితో పాటు న్యాయవాదులు బుగత శివన్నారాయణ, బొంగులూరి మధుబాబు, మల్లేశ్వరరావు, వరలక్ష్మి, కోర్టు సిబ్బంది శ్రీలక్ష్మి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.